నిరసననుద్దేశించి మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

చవితికి ధరాఘాతం

- నిత్యావసరాల ధరలతో సామాన్యులు బెంబేలు - పండగ పూటా ప్రత్యేక వంటలు కష్టమే

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

పండుగల్లో వినాయచవితి ప్రధానమైన పండగే. వినాయక ప్రతిమల ఏర్పాటు నుంచి ఇంట్లో పిండి వంటల వరకూ అన్నింటా సందడి నెలకొల్పుతుంది. అలాంటి చవితికి ధరాఘాతం తప్పడం లేదు. నిత్యావసరాల ధరలతో సామాన్యుల బెంబేలెత్తుతున్నారు. పండగ పూట కూడా ప్రత్యేక వంటకాలు కష్టంగా మారనున్నాయి...

నిత్యావసరాల ధరలు రోజు రోజుకు పెరుగుతూ పోతున్నాయి. పెరిగిన ధరలతో వినాయక చవితి పండుగకు ప్రత్యేక వంటలు కష్టమని సామాన్యులు వాపోతున్నారు. వినాయక చవితికి ఉండ్రాళ్లు, కుడుములు, బక్షాలు వంటి పిండి వంటలు చేసుకుంటారు. వాటికి ఉపయోగించే నిత్యావసరాల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. కర్నూలు నగరంలో కిలో శనగ బేడలు రూ.110, బెల్లం రూ.70, మైదా రూ.45, లీటరు నూనె రూ.110 నుంచి రూ.150 వరకు, 100 గ్రాముల నెయ్యి రూ.80గా ఉంది. ఆదోనిలో కంది బేడలు కిలో రూ.150, శనగ బేడలు రూ.120, లీటరు పామాయిల్ రూ.100, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.120, కిలో మైదా పిండి రూ.50, బెల్లం రూ.60 ఉన్నాయి. నలుగురు కుటుంబ సభ్యులున్న ఇంటిలో పిండి వంటలు చేసుకునేందుకు కనీసం రూ.500 వెచ్చించాల్సి వస్తోంది. దీంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కొందరు ఉన్న దాంతో కొద్ది మొత్తంలో పిండి వంటలు చేసుకుంటుండగా మరికొందరు పాయసంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. మరో వైపు గ్యాస్ ధర కూడా ఆకాశాన్ని అంటుతోంది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.860గా ఉంది. దీంతో చాలా మంది ఇంట్లో స్టవ్ వెలిగించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

పెరిగిన బొమ్మల ధరలు..

వినాయకుడి బొమ్మలకు డిమాండ్ పెరగడంతో ధరలు కూడా భారీగా పెంచేవారు. గత మూడేళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం విగ్రహాల ధరలు భారీగా పెరిగాయి. నాలుగు అడుగుల విగ్రహం గతంలో నాలుగైదు వేలు ఉంటే ఇప్పుడు రూ.తొమ్మిది వేల నుంచి రూ.పది వేలకు విక్రయిస్తున్నారు. గత రెండేళ్లుగా వినాయక చవితి ఉత్సవాలు జరగనందున ఈ ఏడాది విగ్రహాల విక్రయాలు భారీగా ఉంటాయని వ్యాపారులు ఆశించినప్పటికీ బుకింగ్స్ మాత్రం ఆ స్థాయిలో లేకపోవడంతో తయారీదారులు కొంత కలవరానికి గురవుతున్నాయి.

అన్నీ బయటే కొనుగోలు..

ఒకప్పుడు పండుగకు కావాల్సిన వస్తువులను గ్రామాల నుంచి సేకరించేవారు. కానీ ప్రస్తుతం గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. వినాయక చవితికి కావాల్సిన వస్తువులను ఎక్కువగా మంది కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. మామిడి తోరణాల దగ్గర నుంచి పూలు, పండ్లు, తమలపాకులు, ఒనగాయాలు, కొబ్బరికాయ, మోతిగాకులు, వెలక్కాయ, తుమ్మి, సీతాఫలం, బుక్కగులాలు, వెలగపత్రి, గరిక వంటి వాటిని మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. వీటి ధరలు కూడా తక్కువేం లేవు. వాటి దగ్గరికి వెళ్లాలంటే జేబులకు చిల్లు పడినట్లే.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఏటా వానకాలంలో సహజంగా కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. కానీ మునుపెన్నడూ లేని విధంగా ధరలు ఆకాశాన్నంటాయి.

- జలజాక్షి, ఆదోని.

విపరీతంగా ధరలు పెరిగాయి

విపరీతంగా నిత్యవసర ధరలు పెరిగాయి. వినాయక చవితి చేయలేకపోతున్నాం. నిత్యావసర ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఏది కొనాలన్నా కేజీకి రూ.100 పైగానే ధరలు పలుకుతున్నాయి. దీంతో వినాయక చవితి చేయడం కష్టంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిత్యవసర వస్తువుల ధరలు అందుబాటులో తీసుకురావాలి.

- ఎం.చలపతి, ఆదోని పట్టణం.

సోలార్ ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపేయాలి

- రైతు సంఘాల హెచ్చరిక

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ఓరకల్లు మండలం ఉయ్యాలాడ గ్రామంలో నిర్మిస్తున్న సోలార్ ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపేయాలని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. శుక్రవారం ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పరిశ్రమ వద్దే వద్దు అంటూ నినాదాలు చేస్తూ కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయం ముందు రైతులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఎపి రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి జగన్నాథం, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, రైతుసంఘం నాయకులు రమేష్, మధుసూదన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేపడుతామని గత క్యాబినెట్ తీర్మానం చేయడంతో రైతులు తీవ్ర ఆందోళన చెంది వివిధ రూపాలలో ఆందోళన చేశారని మొత్తం గ్రామమంతా ముక్తకంఠంతో గ్రామపంచాయతీ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారని అన్నారు. అంతటితో ఎలక్షన్ కోడ్ రావడంతో ఆందోళన ఆగింది, ప్రతిపక్షంలో ఉండే తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామానికి వచ్చిన సందర్భంగా మా గ్రామంలో సోలార్ పరిశ్రమ మాకు వద్దంటూ వినతులు కూడా ఇచ్చారని ఆ సందర్భంగా మేము అధికారంలోకి వస్తే సోలార్ ప్లాంట్ ను రానివ్వకుండా అడ్డుకుంటామని హామీ ఇచ్చారని అన్నారు. కానీ ఇప్పుడు నూతనంగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ మధ్యకాలంలోనే మళ్లీ అధికారులు ఊర్లో సర్వే చేయడం కోసం రావడంతో రైతులు ప్రజలు తీవ్రమైన ఆందోళన చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సందర్భంగా అధికారులను ముక్తకంఠంతో వెనక్కు పంపించారని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆలోచన చేసి ఆ ప్రాంతంలో ఉన్న రైతులతో గ్రామసభ జరిపి రైతుల ఆమోదం లేకుండా భూములను తీసుకోవద్దని డిమాండ్ చేశారు. ఆభూములలో వందలాది మంది రైతులు మామిడి తోటలు, పూల తోటలు వివిధ రకాల పంటలు వేసుకుంటూ జీవనం పొందుతున్నారని, అదేవిధంగా మామిడికి పేరెన్నిక గల ప్రాంతమని తెలిపారు. రైతుల భూములలో అన్నింటికీ బోరు బావులు ఉన్నాయని మంచి పంటలు పండిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే డి ఆర్ డి ఓ (రక్షణ పరిశోధన కేంద్రం)పేరుతో ఆ గ్రామంలో ప్రభుత్వ ప్రైవేటు భూములు పోవడం వలన పశువులకు మేత లేక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ,మళ్లీ ఇప్పుడు సోలార్ ప్లాంట్ తో ఉన్న భూములు తీసుకుంటే అక్కడ పశువులకు, గొర్లకు మేత లేక ఇబ్బందులకు గురవుతారని అన్నారు. దీనివల్ల ఊరంతా ఖాళీ చేసి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసి క్యాబినెట్ తీర్మానాన్ని వెనక్కి తీసుకొని సోలార్ ప్లాంటును రద్దుచేసి రైతుల పొలాలను, పశువులు, గొర్ల కాపర్ల జీవనాన్ని దెబ్బతీయవద్దని, పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ప్రజా వ్యతిరేకమైన నిర్ణయాలను ప్రభుత్వాలు చేసినప్పుడు రైతులు ప్రజలు రాజకీయాలతో సంబంధం లేకుండా అందరూ ఐక్యమై తిప్పి కొట్టాలని, 20 రోజుల లోపల పత్రిక ప్రకటనలో సోలార్ పరిశ్రమను నిర్మాణాన్ని విరమించుకుంటున్నామని తెలుపకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని, నేషనల్ హైవే ను కూడా దిగ్బంధనం చేస్తామని ఈ సందర్భంగా జరిగే పరిణామాలకు ప్రభుత్వము బాధ్యత వహించాలని వారు హెచ్చరించారు. గ్రామ రైతులు మహబూబ్ బాషా, రామకృష్ణ, సుబ్బరాయుడు, హుస్సేన్, వెంకటరమణ, తిరుపతయ్య శ్రీరాములు, వేణుగోపాల్, బ్రహ్మచారి, సరస్వతి, మధు శ్రీనివాసులు, వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

- ప్రజాశక్తి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, నైతిక విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాల ఆడిటోరియంలో ప్రజాశక్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ వివి.సుబ్రమణ్య కుమార్ మాట్లాడుతూ... ఉపాధ్యాయులు సమాజంలో కీలకపాత్ర పోషిస్తారని అన్నారు. ఒక మంచి సమాజాన్ని నిర్మించేందుకు ఉపాధ్యాయులు అందరూ కృషి చేయాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యకులు కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ... సమాజంలో అసమానతలు పోగొట్టేలా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని కోరారు. సామాజిక స్పృహతో ప్రజాశక్తి ఉన్నది ఉన్నట్లు వార్తలు ప్రచురిస్తుందన్నారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా మాట్లాడుతూ... ప్రజాశక్తి ఎప్పటికీ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పక్షాన నిలబడుతుందన్నారు. విద్య అనే ఆస్తి వైపు సమాజం నడవాలని, ఆ దిశగా కృషి చేసిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్నామని తెలిపారు. కల్లూరు ఎంఇఒ వనజ కుమారి మాట్లాడుతూ... విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రజాశక్తి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కర్నూలు అర్బన్ ఎంఇఒ విజయ కుమారి మాట్లాడుతూ... విద్యకు ప్రజాశక్తి ఇస్తున్న ప్రాధాన్యత చాలా గొప్పదన్నారు. అనంతరం పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా, మోమెంటోతో సన్మానించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, అధ్యక్షులు రవి కుమార్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జీ పానుగంటి చంద్రయ్య, స్టాఫ్ రిపోర్టర్ ఎంయు.వినయ్ కుమార్, డివిజన్ ఇన్‌ఛార్జీ ఎల్లాగౌడ్, విలేకరులు చంద్రమోహన్, మునిస్వామి, సత్యం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అబ్దుల్ కలాం హైస్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఎంఇఒలు వనజ కుమారి, విజయకుమారి, యుటిఎఫ్ నాయకులు, ప్రజాశక్తి సిబ్బంది

రింగ్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

బి.తాండ్రపాడు నుండి గార్గేయపురం వరకు జరుగుతున్న రింగ్ రోడ్డు పనులను నవంబర్ 15 నాటికి పూర్తి చేయాలని ఎన్‌హెచ్ 340సిపిడిని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పెండింగులో ఉన్న ప్రాజెక్టులపై నేషనల్ హైవే అధికారులతో కలెక్టర్ పి.రంజిత్ బాషా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ 340బికి సంబంధించి సోమయాజుల పల్లె నుంచి డోన్ రూట్‌కు సంబంధించిన భూసేకరణ పనులు త్వరగా చేయాలని కర్నూలు ఆర్‌డిఒను ఆదేశించారు. ఎన్‌హెచ్ 167కు సంబంధించి ఆదోని బైపాస్ కొరకు భూసేకరణ పనులు త్వరగా చేయాలని ఆదోని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. జెసి డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ ట్రైని కలెక్టర్ చల్లా కళ్యాణి, ఇన్చార్జి డిఆర్‌ఒ చిరంజీవి, కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి, ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర, ఎన్‌హెచ్ 340సి పిడి పద్మ, ఎన్‌హెచ్ 40 పిడి అశోక్ కుమార్, ఎన్‌హెచ్ 150సి పిడి తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

సన్మానించిన పిఇటీలతో రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్

విద్యార్థులను క్రీడాకారులుగా మలిచేది పిఇటిలు

- రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

విద్యార్థులను క్రీడాకారులుగా మలిచేది వ్యాయామ ఉపాధ్యాయులని మాజీ రాజ్యసభ సభ్యులు టిజి. వెంకటేష్ అన్నారు. శుక్రవారం కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఉత్తమ పిఇటి అవార్డుల ప్రధానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాసంస్థలో క్రీడల కోసం మౌలిక సదుపాయాలు కల్పించి క్రీడా పరికరాలను అందజేస్తే పిఇటిలు విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మలచగలుగుతారని, అలాంటి క్రీడాకారులను తయారు చేసే పిఇటిలకు ఉత్తమ పిఇటీ అవార్డుల ఇవ్వడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఉత్తమ పిఇటి అవార్డు గ్రహీతలైన ఎంఎండి.బాష, సుబ్రహ్మణ్యం, కొండేపోగు చిన్న సుంకన్న, ఓబన్న, రాఘవేంద్ర ,సాలమ్మ సరళ, కళ్యాణి ,కవితలను స్పోర్ట్స్ పాటు శాలువా పూలమాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బి రామాంజనేయులు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు, విశిష్ట అతిథి స్పోర్ట్స్ ప్రమోటర్ జి.శ్రీధర్ రెడ్డి, సి.హర్షవర్ధన్, క్రీడా సంఘ ప్రతినిధులు దాసరి సుధీర్, గుడిపల్లి సురేందర్, నాగరత్నమయ్య, వంశి, ప్రభాకర్, మాజీ ఎస్ఎఫ్ఐ సెక్రెటరీ లక్ష్మయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొని సన్మాన గ్రహీతలను కరచాలనంతో అభినందించారు.

సి బెళగల్ బస్టాండులో జెసిబితో శ్రమదానం

ప్రజాశక్తి-సి బెళగల్

మండల కేంద్రమైన సి బెళగల్ బస్టాండ్ ఆవరణం నందు రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు నీటి కుంటలుగా మారాయి. ఇక్కడే ఆటోలు, బైకులు, ఇతర వాహనాలు కింద పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఏళ్లుగా ప్రాథమిక చర్యలు చేపట్టిన ఆనవాలు కానరాలేదు. ఎట్టకేలకు రోడ్డుకు ఆనుకొని ఉన్న మన్సూర్, ఉరుకుందులు సొంత ఖర్చులతో జెసిబి ద్వారా కుంటలుగా ఏర్పడిన గుంతలను శ్రమదానంతో చదును చేయించారు. దీంతో వాహనాలు సజావుగా వెళ్ళుటకు కొంత దోహదపడిందని పలువురు శ్రమదానం చేయించిన మన్సూర్, ఉరుకుందులకు అభినందనలు తెలిపారు.

11న ఆర్‌టిఎ కార్యాలయం ముట్టడి

-డ్రైవింగ్ టెస్ట్, ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకిద్దాం

-రవాణా వాహన యజమానులు, డ్రైవర్ల సంఘాల ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్: ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేస్తున్న సెన్సార్ ఫిట్నెస్ ట్రాకులను వెంటనే నిలిపివేయాలని ఈనెల 11న బుధవారం 10 గంటలకు ఆర్‌టిఎ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక కర్షక భవన్ సిఐటియు కార్యాలయంలో ఆటో కార్మిక సంఘం, సిఐటియు , లారీ ఓనర్లు డ్రైవర్ల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రియాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఎండి.అంజిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.సాయి బాబా, లాంగ్ లారీ, లోకల్ లారీ అసోసియేషన్ నాయకులు మిన్నల్లా, సామేలు ,ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ లు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మోటార్ యాక్ట్ సవరణ చట్టం భారత న్యాయ సంహిత బిల్లులో భాగంగా వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు ,డ్రైవింగ్ లైసెన్స్ టెస్టింగ్ చేసే ట్రాక్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పచెప్పి ఆటోమేటిక్ సెన్సార్ టెస్టింగ్ ట్రాక్ సిస్టం ద్వారా వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్స్, రిజిస్ట్రేషన్లు డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిఎ కార్యాలయాల్లోనే డ్రైవింగ్ ,ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఆర్‌టిఎ కార్యాలయాలను అభివృద్ధి చేసి ప్రజలకు వాహనదారులకు పనులు సులభతరం చేయడానికి ప్రభుత్వాలు ప్రయత్నం చేయాలి తప్ప అనేక జీవోలు తెచ్చి గుండు గుత్తగా ఆర్‌టిఎ కార్యాలయాలను ప్రైవేటు సంస్థలకు అప్పచెప్పి ప్రభుత్వాలు తమ బాధ్యతలనుంచి తప్పుకోవడం సరైంది కాదన్నారు. కొత్తగా తెచ్చిన నిబంధనల వల్ల ఏ ఒక్క వాహనం ఒకేసారి ఫిట్నెస్ సర్టిఫికెట్ తీసుకోలేరని, దీనివల్ల రోజూ ఆటో నడిపితే కానీ పూట గడవని ఆటో డ్రైవర్లు సుదూర ప్రాంతాలకు వెళ్లే లారీలు, భారీ వాహనాలు ఫిట్నెస్ సర్టిఫికెట్ కోసం రోజుల తరబడి వాహనాలు నిలుప వలసి వస్తుందన్నారు. వీటివల్ల వాహనదారులకు అధిక మొత్తం ఖర్చు అవ్వడమే గాక ఆర్థిక ఇబ్బందులతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఆటో కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి. రాధాకష్ణ ,రవి కార్యదర్శులు పి. మహమూద్ ,లైట్ మోటారు వెహికల్ అసోసియేషన్ బ్రహ్మానందగౌడ్. ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు సిద్దయ్య, ఆటోమొబైల్ రంగం నాయకులు గోవిందు, లోకల్ లారీ అసోసియేషన్ నాయకులు లైట్ మోటార్ వెహికల్స్ యూనియన్ నాయకులు డ్రైవర్లు, ఓనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు

క్లాప్ డ్రైవర్ల పెండింగ్ వేతనాలివ్వాలి

కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్: కర్నూలు నగరంలో పనిచేసే స్వచ్ఛ ఆంధ్ర క్లాప్ డ్రైవర్ల 9 నెలల పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర క్లాప్ డ్రైవర్ల 9నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన ధర్నా చేశారు. ఎండి.అంజిబాబు, సిఐటియు ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి మారెళ్ళ విజయ రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు మహమూద్, కుమార్ మాట్లాడారు. 9 నెలలుగా పెండింగులో జీతాలు ఉండటం వలన కార్మికుల కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నారని తెలిపారు. 52 వార్డులు చెత్త లేని నగరంగా పరిశుభ్రంగా ఉన్నాయంటే క్లాప్ డ్రైవర్ల కష్ట ఫలితమేనని గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ పేరుతో ఆటోలకు డ్రైవర్లను రిక్రూట్మెంట్ చేసుకుని అగ్రిమెంట్ ప్రకారం రూ.18500 జీతం ఇఎస్ఐ, పిఎఫ్, కార్మిక చట్టాల అమలు చేస్తామని చెప్పి బినామీ ఏజెన్సీలతో కార్మికుల కడుపు కొట్టారని విమర్శించారు. గతంలో కార్మికుల పోరాటం వలన కమిషనర్ జోక్యం చేసుకొని కొంత పెండింగ్ జీతాలు ఇచ్చి ఇప్పటినుండి జీతాల బాధ్యత నాదేనని ఒప్పుకుని పని చేయించు కుని తీరామోసం చేశారని తెలిపారు. జీతాలు ఇవ్వకుండా కార్మికులను భయపెడుతూ పని చేయించుకుంటున్నారు తప్ప, ఆ కార్మిక కుటుంబాలకు పోషణ ఎలా అని మాత్రం ఆలోచించరన్నారు. గత ప్రభుత్వం కార్మికులను మోసం చేసినందుకే ఇంటికి పంపించారని, ఈ ప్రభుత్వమైనా చొరువ తీసుకోవాలన్నారు. అగ్రిమెంట్ ప్రకారం రూ.24 వేల జీతాన్ని ఇప్పించి, ఇఎస్ఐ, పిఎఫ్, పని భద్రత కల్పించి కార్మికుల పక్షాన నిలవాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. మేనేజ ర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఏజెన్సీ వారితో మాట్లాడి జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

ఇసుక రీచ్‌లను, బుకింగ్ సెంటర్లను పెంచాలి

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

ఇసుక ఉచితంగా ఇస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో ప్రజలకు ఇసుక కష్టాలు తీరడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి కారణం ఇసుక రీచ్‌లో తక్కువగా ఉండడం, అవి చాలా దూరం ఉండడం, బుకింగ్ సెంటర్లు కూడా చాలా తక్కువ ప్రాంతాల్లో ఉండడంతో ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. అందుకోసం ప్రజలకు అందుబాటులో ఇసుక తేవాలని, బుకింగ్ సెంటర్లను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కొత్త సినిమా రిలీజ్ అయినప్పుడు టికెట్ల కోసం తెల్లారుజామున క్యూలో ఎలాగా నిలబడతారో ఇసుక కోసం ఆ రకంగా నిలబడాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇసుక బుకింగ్ కేంద్రాల వద్ద ట్రాక్టర్ల, టిప్పర్ల యజమానులు బారులు తీరుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్ బుకింగ్ సిస్టం వచ్చేవరకు జిల్లాలో బుకింగ్ సెంటర్లను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐనాయకులు అబ్దుల్లా, రంగయ్య

వివక్షచూపే టీచర్లను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

నందవరం మండలం పూలచింత గ్రామంలోని ఎంపీయూపీ ప్రాథమిక పాఠశాలలో కులం పేరుతో విద్యార్థులను అసభ్యకరంగా మాట్లాడితున్న ప్రధానోపాధ్యాయులు నరేష్ ను, ఉపాధ్యాయులు పవన్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో %ణజుఉ% శామ్యూల్ కు వినతిపత్రం ఇచ్చారు.అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప,అబ్దుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులను కుల పేరుతో దూషించడం చాలా బాధాకరం అని విద్యార్థుల మధ్య నీవు ఎక్కువ కులం నీవు తక్కువ కులం అంటూ చిన్న వయసులోనే ఆ పసి పిల్లల మనసులలో కులాన్ని చొప్పించి విడదీస్తున్నారని,క్రమశిక్షణ పేరుతో పాఠశాలకు ఆలస్యంగా వెళ్తున్నా విద్యార్థులను అసభ్యకరమైన పదజాలంతో తిడుతూన్నారని అలాగే శ్రావణమాసం పేరుతో ఎస్సీ,బీసీ కులాల వారిగా వేరు వేరు చోట కూర్చోబెట్టి ఉపాధ్యాయ వృత్తికే మాయని మచ్చ తెచ్చిన ప్రధానోపాధ్యాయులు నరేష్, ఉపాధ్యాయులు పవన్ లను తక్షణమే విధులు నుండి తొలగించి జిల్లాలో ఎక్కడ కూడా ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అమర్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

నిమజ్జనం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 11న జరిగే గణేష్ నిమజ్జన ఉత్సవాలు ఘనంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై అధికారులు, ఉత్సవ కమిటీలతో శుక్రవారం వినాయక మాల్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 7న వినాయక చవితి పండగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పట్టణంలో 11న జరిగే నిమజ్జనంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా మౌళిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, లైటింగ్, శానిటేషన్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నిమజ్జనానికి వెళ్లే రోడ్లలో ఏదైనా గుంతలు ఉంటే వాటిని గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. నిమజ్జనం దగ్గర గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో క్రేన్లు అందుబాటులో ఉంచాలన్నారు. అవసరం మేరకు క్రేన్లు సంబంధించిన టెక్నికల్ వారిని కూడా నియమించుకోవాలని ఆర్‌టిఒ అధికారులను ఆదేశించారు. అలాగే గజ ఈతగాళ్ళ ఏర్పాట్లు చేయాలని ఫిషరీస్ అధికారులకు సూచించారు. 11న జరిగే నిమజ్జనోత్సవాన్ని పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. అంతకుముందు నిమజ్జనం చేసే కెనాల్ స్థల ప్రాంతాన్ని అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ పరిశీలించారు. డీఎస్పీ సోమన్న, ట్రెయినీ డీఎస్పీ ధీరజ్, తహశీల్దార్ శివ రాముడు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డిఎల్‌పిఒ నూర్జహాన్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, సభ్యులు దేవిశెట్టి ప్రకాష్, చంద్రకాంత్ రెడ్డి, విట్టా రమేష్, ప్రతాప్ స్వామి, సాయి వాల్మీకి పాల్గొన్నారు.

ఎంపిటిసిలకు అందని జీతాలు

- రూ.3 వేలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వాలు - ఇదేం దారుణమంటున్న ఎంపిటిసిలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

స్థానిక ప్రజాప్రతినిధులైన ఎంపిటిసిలకు జీతాలివ్వలేని పరిస్థితి నెలకొంది. అసలు ఎంపిటిసిలకు జీతాలిస్తారా..? లేదా..? అన్న అనుమానం వ్యక్తమవుతోంది. ప్రస్తుత, గత ప్రభుత్వాల నుంచి 18 నెలల పాటు జీతాలు అందలేదు. బిల్లులు పెట్టినట్లు చెబుతున్నా జీతాలు మాత్రం అందడం లేదు.

ఆదోని మండలంలో 27 మంది వరకూ ఎంపిటిసిలున్నారు. వీరంతా ఎంతో ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలిచారు. ఎంపిటిసిలకు గ్రామాల్లో సరైన ప్రాధాన్యత లేకుండాపోయింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపిటిసిల పరిస్థితి గురించి వేరే చెప్పనక్కర్లేదు. కనీసం వేతనాలు కూడా ఇవ్వడం లేదు. ఎంపిటిసిలకు నెలకు రూ.3 వేలు గౌరవ వేతనంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిటిసిలు పదవీ బాధ్యతలు చేపట్టి మూడేళ్ళ గడిచిపోయింది. గత 18 నెలల నుంచి జీతాల ఊసే లేదు. ఒక్కో ఎంపిటిసికి వేతనం కింద దాదాపు రూ.54 వేలు పైగా అందాల్సి ఉంది. ప్రజాప్రతినిధులకు నిత్యం అనేక విధాలుగా ఖర్చులు ఉంటాయి. పెండింగ్ జీతం ఇస్తే ఏదో ఒక ఖర్చుకు వస్తుందన్న భావన ఎంపిటిసిల్లో వ్యక్తమవుతోంది. ఎస్సీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన పలువురు ఎంపిటిసిల్లో రోజువారీ పని చేసుకుని జీవించే వారు సైతం ఉన్నారు. ప్రజాప్రతినిధిగా ఎంపికైన తర్వాత గ్రామాల్లో తిరగడం వంటి అనేక పనులు ఉండడంతో ఖర్చులు తప్పవు. ప్రభుత్వం నుంచి వేతనాల రూపంలో రావాల్సిన సొమ్ములు రాకపోవడంతో చాలామంది ఎంపిటిసిలు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపిటిసిల్లో వేతనాల గురించి పట్టించుకునేవారు ఎవరున్నారంటూ చర్చ నడుస్తోంది. ఎంపిటిసిలంతా ధనవంతులు కాదని, రిజర్వేషన్ సీట్లలో రోజువారీ పని చేసుకునే నాయకులు సైతం ఉన్న పరిస్థితి నెలకొంది. ఎంపిటిసిల జీతాల గురించి ఏ ఒక్కరూ మాట్లాడడం లేదు. ఎమ్మెల్యేలకు, ఎంపీలకు ప్రతి నెలా ప్రభుత్వం జీతాలు ఇచ్చేస్తోంది. మరి స్థానిక ప్రజాప్రతినిధులకు మాత్రం ఏళ్ల తరబడి జీతాలివ్వడం లేదు. గ్రామాల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులదే కీలకపాత్ర. ఎమ్మెల్యేలకు, ఎంపీలకు

ఎంపిడిఒ కార్యాలయం

రూ.లక్షల్లో జీతాలు, అలవెన్సులు ఇస్తున్న ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులైన ఎంపిటిసిలకు మాత్రం రూ.3 వేలు వేతనం మాత్రమే ఇస్తోంది. ఆ సొమ్ము కూడా సకాలంలో ఇవ్వని పరిస్థితి నెలకొంది. ప్రజలకు నిత్యం దగ్గరగా సర్పంచులు, ఎంపిటిసిలే ఉంటారు. అలాంటి ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పలు చోట్ల ఎంపిటిసిలకు కొన్ని నెలల వేతన సొమ్ము జమైనట్లు చెబుతున్నా స్పష్టత లేకుండా పోయింది. ఎంపిటిసిల జీతాల పెండింగ్‌కు సంబంధించి ప్రజాప్రతినిధుల్లో హాట్ టాపిక్‌గా మారింది. గత, ప్రస్తుత ప్రభుత్వాల నుంచి జీతాలు అందలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు అవుతున్నా జీతాలు వస్తాయని ఆశతో ఎదురు చూస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచి, ఎంపిటిసిలను ప్రభుత్వం ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. స్థానిక ప్రజాప్రతినిధులకు ఇవ్వాల్సిన జీతాల విషయంలోనూ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ఎంపిటిసిలకు పెండింగ్ జీతాలు జమ చేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

- ఎమ్మెల్యే బీవీ

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షిణ సాధ్యమని మానవ మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్‌టిసి డిపోలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని తెలిపారు. డిపో మేనేజర్ అమర్‌నాథ్, టిపిఒ గోపాల కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్

ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్

కలెక్టర్ చేతుల మీదుగా ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఉప్పరహాల్, బదినేహాల్ గ్రామానికి చెందిన దూదేకుల సంఘానికి చెందిన పలువురు రూ.1.21 లక్షలు చెక్కు రూపంలో బాధిత కుటుంబానికి కలెక్టర్ రంజిత్ బాష చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారులు పి.సాయిబాబు, పి.ఇమామ్ ఖాసీం, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.షేక్షావలీ, జిల్లా అధ్యక్షులు మహబూబ్ బాషా, జిల్లా సెక్రటరీ సిద్ధయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మాబుసాబ్ మాట్లాడారు. హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన దూదేకుల ఖాసీం సాబ్, షేకమ్మ దంపతులు మృతి చెందగా ముగ్గురు ఆడపిల్లలు అనాథలుగా మిగిలారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సింధనూర్ దూదేకుల సంఘం నాయకులు రూ.8 లక్షల వరకు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు చెప్పారు. మండలంలోని బదినేహాల్, ఉప్పరహాల్ గ్రామస్తుల నుంచి మరి కొంత ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. పిల్లల పరిస్థితి తెలుసుకున్న కలెక్టర్ రంజిత్ బాష పిల్లలు కోరుకున్న చోట చదివించడానికి సహాయ, సహకారాలు అందిస్తామని హామీఇచ్చారు. మల్కన్న, ఖాదర్ బాషా, ఖాసీం, షేకన్న పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో వెలుగులు

- డాక్టర్ శాలి జమీల్

ప్రజాశక్తి - హోళగుంద

వికలాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చేయడం వల్ల వారి జీవితాల్లో వెలుగు నింపవచ్చని హోళగుందకు చెందిన ఫిజియో డాక్టర్ శాలి జమీల్ తెలిపారు. శుక్రవారం కుటుంబ సభ్యులు శాలి మచ్చావలీ, శాలి ఖాజా, శాలి షబ్బీర్ మాట్లాడారు. హోళగుందలో శాలి కుటుంబంలో పుట్టి, ఉన్నత చదువులు చదివి చిన్న వయస్సులోనే డాక్టర్ అయిన శాలి జమీల్ వికలాంగుల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం డాక్టర్ శాలి జమీల్ మాట్లాడారు. వికలాంగులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, క్రమం తప్పని ఫిజియోథెరపీ వికలాంగులకు వరమని చెప్పారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వైద్యుల సలహాలు పాటించాలని సూచించారు. ఆదోని, ఎమ్మిగనూరులో శాలి ఫిజియోథెరపీ వైద్యశాల ఆధ్వర్యంలో మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఫిజియో వైద్యులు షరీఫా, శివరాజ్, ముంతాజ్ పాల్గొన్నారు.

ఫిజీయోతేరపి నిర్వహిస్తున్న డాక్టర్ శాలి జమీల్

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని హెచ్.మురవనిలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల కింద ఎస్సీ రైతులకు వ్యవసాయ పని ముట్లను టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెద్దకడబూరు మండలం అత్యంత వెనుకబడిన ప్రాంతమని, ప్రభుత్వం ఇక్కడి ఎస్సీ రైతులను గుర్తించి పనిముట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలో అధిక జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, ఇక్కడ రైతులకు వ్యవసాయంలో నైపుణ్యం పెంచేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు శిక్షణ తరగతులు నిరహిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ హైదరాబాద్, ఎస్సీ సబ్‌ప్లాన్ ఛైర్మన్ బాలకృష్ణ రైతులకు పనిముట్లు, వివరాలను వెల్లడించారు. నారమ్ సంస్థ ప్రతినిధులు శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ నాయక్, టెక్నికల్ ఆఫీసర్ విజయేంద్ర రెడ్డి, లక్ష్మణ్ అహిరే, శేఖర్ రెడ్డి, ఎఒ వరప్రసాద్, టిడిపి మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, నాయకులు విజయ్ కుమార్, హనుమంత రెడ్డి, ఏసేపు, మల్లికార్జున, సత్యన్న, శౌంటయ్య, నరసయ్య, సురేష్, రంగన్న పాల్గొన్నారు.

దేశ ఆర్థిక దిక్సూచి ఎల్ఐసి

- ప్రజా వైద్యులు డాక్టర్ మాలకొండయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దేశ ఆర్థిక దిక్సూచిగా ఎల్ఐసి నిలిచిందని ప్రజా వైద్యులు డాక్టర్ మాలకొండయ్య తెలిపారు. శుక్రవారం ఎల్ఐసి వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ మాలకొండయ్య, ఎల్ఐసి బ్రాంచి మేనేజర్ పులి నాయక్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సంతోష్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మహేష్ కుమార్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కార్యదర్శి విజయకుమార్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ మధుసూదన్, లియాఫీ బ్రాంచి నాయకులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. 68 ఏళ్ల క్రితం ప్రజల డబ్బు, ప్రజల సంక్షేమం అనే నినాదంతో ఎల్ఐసి ఏర్పడిందని తెలిపారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎల్ఐసి పాలసీలు ఉన్నాయని తెలిపారు. ఎల్ఐసి సిబ్బంది ప్రతాప్, ఇందిరా, సుధాకర్ రావు, మొయినుద్దీన్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రఘునాథ్ గౌడ్, గోవర్ధన్, మురళీ, హంపయ్య, రాము, శంకర్, వినయ్ కుమార్, వెంకటేష్, ఏజెంట్ రంగస్వామి, రమేష్, అబ్దుల్, గఫూర్, హరినాథ్, వీరేష్, దేవేంద్ర మూర్తి, సూర్యకాంత్ రెడ్డి, రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రజా వైద్యులు డాక్టర్ మాలకొండయ్య

బిల్లేకల్లు కూరగాయల మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన టమోటా, కూరగాయల మార్కెట్‌ను టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దినసరి కూరగాయల మార్కెట్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాపారులు కూడా రైతులను దృష్టిలో ఉంచుకొని టమోటా, కూరగాయలను కొనుగోలు చేయాలని తెలిపారు. అనంతరం వీరభద్ర గౌడ్‌కు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. మార్కెట్ నూతన కాంట్రాక్టర్ వీరేష్, మహేష్, మాజీ ఎంపిపి వెంకటేష్, మాజీ సర్పంచి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వీరభద్ర గౌడ్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ముస్లిం, మైనార్టీలు మేల్కోవాలి

- బిజెపి కుట్ర పన్నుతోంది - వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు రద్దు చేయాలి
- ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్

ప్రజాశక్తి - కౌతాళం

దేశంలో ముస్లిం, మైనారిటీలపై బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఇప్పుడు మేల్కోకపోతే ప్రమాదంలో పడినట్లేనని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్ తెలిపారు. ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ముస్లింలు శుక్రవారం పాతబస్టాండ్, మెయిన్ రోడ్, పురవీధుల గుండా వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. అనంతరం ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్, కౌతాళం శ్రీఖాదర్ లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా, నాయకులు పాల్ దినకరన్ మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఏదో ఒక రకంగా ముస్లిం, మైనారిటీలను ఇబ్బంది పెట్టాలని కక్ష సాధింపు కొనసాగిస్తూనే ఉందని విమర్శించారు. గతంలో ఎన్ఆర్‌సి, సిఎఎ, హిజాబ్ వంటి రకరకాల చట్టాలను తెచ్చి ఇబ్బందులకు గురి చేసిందని తెలిపారు. పలు రాష్ట్రాల్లో ఆందోళన జరిగేలా చేయడం బిజెపి ప్రభుత్వ లక్ష్యమని మండిపడ్డారు. 2014కు ముందు దేశంలో హిందూ, ముస్లింలు కలిసిమెలిసి జీవించేవారని, గ్రామాల్లో వరుసలను కలుపుకోవాలని జీవనం సాగించే వారని చెప్పారు. 2014 తర్వాత దేశంలో అలాంటి వాతావరణమే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య, మహిళలు, పసి పిల్లలపై హత్యలు, అత్యాచారాలు జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వానికి కనబడడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రాల్లో రైతులు, సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. దేశంలో రాజులు, నవాబులు పేద సామాజిక వర్గాలైన ముస్లింలు, దళితుల అభివృద్ధి కోసం భూములు కేటాయించారని తెలిపారు. ఆ భూముల ద్వారా వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. వక్ఫ్ బోర్డు భూములపై చట్ట సవరణ చేసి వాటి ఆశయాలకు తూట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తోందని మండిపడ్డారు. ముస్లిం, మైనారిటీలకు నష్టం జరగకుండా చూసే బాధ్యత తమదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దేశంలోని వివిధ రాజకీయ పార్టీలు రాజ్యసభలో బిల్లుకు మద్దతు ఇవ్వకుండా అడ్డుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవాలని కోరారు. ఖాజా హుస్సేన్, డాక్టర్ మాసూం బాష, డాక్టర్ యాసర్ బాష, వలీసాబ్, కటిగా మహబూబ్, సద్దాం, ఇద్రూస్, టైలర్ బాష, హుస్సేన్ బాష, అబ్బాస్ అలీ, పీర్ సాబ్, మహ్మద్, జామియా మసీద్, మదీనా మజీద్, మజీద్ ఏ ఖదీర్, నూరాణి మజీద్, అక్సా మసీద్ నుంచి వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు.

రాస్తారోకోలో మాట్లాడుతున్న సుభాన్

IN TEH COURT OF THE II ADDL DISTRICT JUDGE AT ADONI
O.S.NO.20/2023

K.Sumathi. ...వాది

-Vs-

1. Jabbu Thimma Reddy
2. Jabbu Naveen Kumar Reddy
3. Jabbu Sailaja @ C.Sailaja
4. Jabbu Abhinav Reddy
5. Jabbu Lasya Reddy. ...ప్రతివాదులు

Summons to Defendant No's 3,4 and 5

పై తెల్పిన వాది Specific performance of contract కొరకు పై తెల్పిన ప్రతివాదులపై వాజ్యమును పై తెల్పిన కోర్టులో వేసి వున్నారు. అయితే 3,4 మరియు 5 ప్రతివాదులకు కోర్టు ద్వారా చాలాసార్లు సమన్లు పంపినను సర్వ్ కాలేదు. కావున Substituted Service ద్వారా 3,4 మరియు 5 ప్రతివాదులకు పేపరు ప్రటన ద్వారా సమన్లు జారి చేయమని కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసి వున్నారు. కావున 3,4 మరియు 5వ ప్రతివాదులు 23-09-2024వ తేది ఉ॥10.30 గంటలకు పై తెల్పిన కోర్టులో ఖుద్దున గాని తమ వకీలు ద్వారా కాని హాజరై తమ ఆక్షేపణలను తెలుపుకోవచ్చునని ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము. అట్లు పై తేదిన హాజరు కాని యెడల పరోక్షముగా కోర్టువారు తీర్మానించుదురని తెలుపుచున్నాము.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 23-09-2024

వాది పరమున అడ్వకేటు
S.Malik Basha,
Advocate,
Kurnool.

సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయుడు

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగ

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థి దశలో మార్గ నిర్దేశకుడిగా, మనుగడకు దిక్సూచిగా నిలిచే వాడే ఉపాధ్యాయుడని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాది లింగప్ప తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని నేషనల్ స్కూల్‌లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లా సహాధ్యక్షులు జీవిత అధ్యక్షత వహించారు. ముందుగా యుటిఎఫ్ కార్యవర్గ సభ్యులు నాగమణి, సీనియర్ ఉపాధ్యాయులు వాణి కుమారి, సుజాత, కుముదిని దేవి, పాపయ్య, కృష్ణమూర్తిలు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటీవల విరమణ పొందిన ఉపాధ్యాయులు వాణి కుమారిని పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ సీనియర్ నాయకులు పాపయ్య మాట్లాడారు. ఉపాధ్యాయులు ఏమీ ఆశించకుండా విద్యార్థుల అభివృద్ధిని కోరుకుంటారని తెలిపారు. గురువు నేర్పిన విద్య ఎప్పటికీ తరిగిపోదన్నారు. నాగమణి మాట్లాడుతూ... రాధాకృష్ణ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. సన్మాన గ్రహీత వాణికుమారి మాట్లాడుతూ... యుటిఎఫ్‌లో ఉన్న ఉపాధ్యాయులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని, చదువుకోవడానికి వచ్చే పేద విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ శ్రీనివాసులు, సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, జంబులింగయ్య, బసప్ప, మల్లయ్య, భోజరాజు, నర్సయ్య గౌడ్, శ్రీనివాసులు, నారాయణ, రుద్రముని, పెద్దయ్య, నాగేంద్ర, జనార్ధన్, బసప్ప, లింగన్న, నాగలక్ష్మి, హసీనా, కళావతి, కల్యాణి, వీర, శ్రీనారాయణమ్మ, లాలమ్మ, పర్వీన్, కృష్ణుడు, శ్రీకాంత్, శివకుమార్ గౌడ్, రాముడు, హనుమంతు, రాజహుస్సేన్, బాలాజీ రావు, భాస్కర్, ఆవుల బసప్ప, ఈరన్న, రాజేష్ ఉన్నారు.

ఎస్‌టియు ఆధ్వర్యంలో : ఎస్‌టియు ఆధ్వర్యంలో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, ఆర్థిక కమిటీ సభ్యులు రామాంజనేయులు, మండల అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు, సీనియర్ నాయకులు సూర్యుడు, రాము, నాగభూషణం, యువ కార్యకర్తలు అంజి, రామాంజనేయులు, ఆర్‌బి.వెంకటేశ్వర్లు, భాస్కర్, లక్ష్మన్న పాల్గొన్నారు.

వాణి కుమారిని సన్మానిస్తున్న మహిళ ఉపాధ్యాయులు

ఎస్ఐ రమేష్ బాబును సన్మానిస్తున్న సర్పంచి పురుషోత్తం

వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని ప్రతి గ్రామంలో కూడా వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రమేష్ బాబును కుందనగుర్తి సర్పంచి కొండా పురుషోత్తం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. కులమతాలకు అతీతంగా వినాయక చవితి పండగను ప్రశాంతమైన వాతావరణంలో, ఎక్కడా, ఏ అల్లర్లు జరగకుండా, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వినాయక చవితి కమిటీ సభ్యులు చూసుకోవాలని తెలిపారు. కుందన గుర్తి గ్రామ పెద్దలు కొండ నెట్టప్ప, కొండ రామ గోవిందు, కొండ ఆంజనేయులు, కొండ రామాంజనేయులు, కొండ శ్రీనివాసులు, మాల సురేష్, కొండ మేఘనాథ్ ఉన్నారు.

ఉత్తుత్తి సర్పంచి, గ్రామాధికారులు

- టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

నందవరంలో ఉత్తుత్తి సర్పంచి, గ్రామాధికారులు ఉన్నారని, ప్రయివేట్ వ్యక్తులు గ్రామంలో ఇష్టానుసారంగా అధిపత్యం చెలాస్తున్నారని టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. గ్రామంలో సర్పంచి, అధికారులు పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గ్రామంలో మురుగుకాలువలు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. వారానికి ఒక్కసారైనా శుభ్రం చేయకుండా ప్రజారోగ్యం పట్ల అశ్రద్ధగా వ్యవహరించడం బాధాకరమన్నారు. పంచాయతీ నిర్వహణలో ఉండాల్సిన తాగునీటి సరఫరా ప్రయివేట్ చేతుల్లో ఉందన్నారు. గ్రామంలో ఇష్టానుసారంగా ప్రయివేట్ వ్యక్తులు పైపులకు బొక్కలు వేసి కొళాయిలను వేస్తున్నారని తెలిపారు. చర్యలు తీసుకోవాల్సిన సర్పంచి ఏమీ చేయలేక ఉత్తుత్తి సర్పంచిగా ఉన్నారని చెప్పారు. ప్రతి చిన్న కట్టడానికి అనుమతి తీసుకోవాలని గ్రామస్తులకు షరతులు పెట్టే అధికారులు గ్రామంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రయివేట్ వ్యక్తులపై చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు. ప్రయివేట్ వ్యక్తులు ఇష్టానుసారంగా ప్రజల దగ్గర ఒక కుళాయికి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారని, నిన్న ఒక్క రోజే 70 కుళాయిలు వేశారని తెలిపారు. ఆయన ఒక్కరోజు ఆదాయం రూ.40 వేల దాకా ఉంటుందని, ప్రజాధనాన్ని దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన సర్పంచి, గ్రామ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. మాజీ సర్పంచి రామన్న గౌడ్, సాధిక్, తోట పాండు, కె.శివ, డానియల్, జెసిపి రాజు, ఇస్రాయిల్ పాల్గొన్నారు.

సిరి వరం మ్యాక్స్ లిమిటెడ్

Regd.No:Amc/knl/dco/2011/2844 D.No.40/29-11-1, 1st Floor, MMM Complex, Park Road, Kurnool. Ph. 08518 - 249199

బంగారు ఆభరణముల వేలం ప్రకటన

దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు తెలియచేయునది ఏమనగా మీరు మా సొసైటి నుండి బంగారు ఆభరములు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణము సకాలంలో చెల్లించలేక పోయినారు. రిజిష్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపినను మీరు స్పందించక మీ గోల్డు లోను పూర్తిగా చెల్లించలేక పోయినారు. కావున ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు తెలుపునది ఏమనగా 17.09.2024 మంగళవారం సాయంకాలం 5 గం॥లకు మా సొసైటీ ఆవరణములో మీరు కుదువ పెట్టిన బంగారు నగలు బహిరంగముగా వేలం వెయ్యబడును. లేదా సొసైటీ అధిష్టానుసారం తరువాత ఎటువంటి నోటీసులు లేకుండా ఇతర అనుకూలమైన తేదీలలో వేలం నిర్వహించబడును.

సిరి వరం మ్యాక్స్ లిమిటెడ్
కర్నూలు

వరు సంఖ్య	జె.ఎల్. నెం.	పేరు చిరునామా	గ్రాస్ వేయిట్
1.	90649	చిట్టెం లక్ష్మి నారాయణ తండ్రి రాఘవేంద్ర డోర్ నెం.27-101, ఓల్డ్‌టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, చిన్నమార్కెట్ కర్నూలు - 518001	27.9
	90613		25.6
2.	90133	అద్దకుల జమ్మన్న తండ్రి ఎస్.శ్రీనివాసులు డోర్ నెం.3-35, మానపాడు, చిన్నముద్యాలపాడు, ఉండవెల్లి, మహబూబ్‌నగర్ - 501953	2.7
3.	90417	పండ్రిల్ల లలిత C/o కుళ్లాయి స్వామి ఇంటి నెం.సి/3 పోలీస్ క్వాట్రస్, రెవెన్యూ కాలనీ, కర్నూలు - 518004	14.9
	90434		9.0
4.	91913	షేక్ అజ్మతుల్లా తండ్రి ఎస్.నూర్ అహ్మద్ డోర్ నెం.76-97-107-9, వీకర్‌సెక్షన్ కాలనీ, ఎస్.ఎ.పి క్యాంప్, కల్లూరు, కర్నూలు - 518003	5.4
5.	9124	తెలుగు వెంకట రాఘవ మహేష్ తండ్రి టి.సత్యనారాయణ ఇంటి నెం.9/287-ఎ, మండిబజార్, మాసుం దర్గా దగ్గర, కర్నూలు - 518001	30.6
6.	92165	షేక్ మహ్మద్ రఫీ తండ్రి అబ్దుల్ ఖుదూస్ ఇంటి నెం.6-995-2, మస్తాన్ పేట్, గుంతకల్, అనంతపురం - 515801	3.9
7.	92051	రఫీ అహ్మద్ తండ్రి అబ్దుల్ రషీద్, డోర్ నెం.54-42, ఫోర్ట్ స్ట్రీట్, కల్లా స్ట్రీట్, మండి మార్కెట్, కర్నూలు.	5.2
8.	92179	మల్లెపోగు అర్జున్ తండ్రి యం.ఎర్ర చిన్నప్ప డోర్ నెం.82-66-1, షరీన్ నగర్, కల్లూరు, కర్నూలు - 518003	12.4
9.	91948	యం.చిన్నరాజు తండ్రి యం.రంగస్వామి డోర్ నెం.8-218, ఉప్పలపాడు, కర్నూలు - 518002	8.4
10.	92271	గుర్రం గడ్డ సత్యనారాయణ తండ్రి రాఘవయ్య డోర్ నెం.46/695-1-ఎ, విజయదుర్గ ఆర్థోపెడిక్ హాస్పిటల్ ఎదురుగా, బుధవారపేట, కర్నూలు - 518001	28.9
11.	90822	జాలరి చెన్నవారి శైలజ C/o జె.సి.సుదర్శనం డోర్ నెం.87/87-11, రెవెన్యూ కాలనీ-2, కర్నూలు - 518002	12.8
12.	91365	షయ్యద్ మహబూబ్‌బాష తండ్రి ఎస్.చాంద్‌బాష డోర్ నెం.23/91, మెగల్‌పూర స్ట్రీట్, కర్నూలు.	22.9

షరతులు : 1) వేలంలో పాల్గొనదలచిన వారు సొసైటీ నిర్ణయించిన ధరావత్తు రూ. 5000/- చెల్లించవలెను. 2) వేలంలో ఆభరణములు పొందిన వారు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును చెల్లించి ఆభరణములు పొందవలెను. 3) ఇదివరకు నోటీసులు చేరని వారు ఈ ప్రకటనను ఆఖరి నోటీసుగా భావించవలెను. 4) వేలములో వచ్చిన డబ్బు జమ చేశాక మిగిలివున్న అప్పును అప్పుదారుని నుండి వసూలు చేయబడును. 5) ఎటువంటి కారణము తెలుపకనే ఈ వేలము పూర్తిగా/పాక్షికంగా వాయిదా చేయుటకు సొసైటీ వారికి పూర్తి అధికారము కలదు. 6) వేలంలో నగలపై తదుపరి ఆక్షేణలపై సొసైటీ బాధ్యత వహించదు. 7) పైన పేర్కొనబడిన ఋణగ్రహీతలలో ఎవరైనా మరణించిన యెడల ఈ నోటీసు వారి వారసులకు వర్తించును.

ముఖ్య కార్యనిర్వహణాధికారి

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ తెలిపారు. ఆయన వివరాల మేరకు... గత కొద్ది రోజులుగా మండలంలో కురిసిన వర్షాలకు పంట భూములు తేమగా మారాయి. పత్తి పంటలో పూత, పిందే రాలిపోవడం, కాయలో మచ్చలు రావడం రైతులు గుర్తించారు. అలాగే కంది, మిరప లాంటి ఇతర పంటల్లో కూడా అధిక తేమతో పంటలు నష్టపోయే అవకాశం కూడా ఉంటుంది. తగిన చర్యలు చేపట్టడం వల్ల అధిక తేమ నుంచి పంటలను కాపాడుకొని అధిక దిగుబడులు పొందవచ్చు.

పత్తి : ప్రస్తుతం కురిసిన వర్షాలకు పత్తి పంటలో మొగ్గ, పూత, పిందె రాలుతున్నాయి. ముందుగా వీటి నివారణకు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలి. తర్వాత ప్లానోఫిక్స్ 1 మిల్లీలీటరు 5 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలి. అలాగే కాయలపై మచ్చలు ఏర్పడి పెద్దవిగా మారి, కాయలు కుళ్లిపోయే అవకాశం ఉంది. కాయకుళ్లు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ 0.1 గ్రాము ఒక లీటరు నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలి.

మిరప : మిరపలో అధికంగా నీరున్న పొలాల్లో 5 గ్రాములు 19:19:19 లీటర్ నీటిలో కలుపుకుని, పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. నారుకుళ్లు, మొదలు కుళ్లు తెగులు నివారణకు మాంకోజెబ్ 2 గ్రాములు లేదా 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొదలు తడిచేలాగా పిచికారి చేయాలి.

కంది : కంది పొలాల్లో అధికంగా నిలిచిన నీటిని తీసేయాలి. 5 గ్రాముల 19:19:19 లీటరు నీటిలో కలిపి, పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఉల్లి : అధిక నీరు నిల్వకుండా చుసుకోవాలి. అధిక వర్షపాతం వల్ల ఉల్లి గడ్డి కుళ్లు తెగులు వస్తుంది. కుళ్లు నివారణకు సాఫ్ కార్బెండిజం మాంకోజెబ్ 1కిలో ఎకరాకు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 50 డబ్ల్యుపి 500 గ్రాములు ఇసుకలో కలిపి భూమిలో చల్లుకోవాలి.



మొగ్గలు రాలిన పత్తి పంటను పరిశీలిస్తున్న ఎడిఎ

మెరుగైన సేవలే లక్ష్యం

- ట్రాయ్ కాగ్ సభ్యులు బత్తుల సంజీవరాయుడు

ప్రజాశక్తి - మంత్రాలయం

టెలికామ్ వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే ట్రాయ్ లక్ష్యమని ట్రాయ్ కాగ్ సభ్యులు డాక్టర్ బత్తుల సంజీవరాయుడు తెలిపారు. శుక్రవారం పిఎస్ఎస్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీరాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో టెలికామ్ వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టెలికామ్ నియంత్రణ ప్రాధికార సంస్థ ట్రాయ్ ప్రధాన బాధ్యతల్లో సెల్ వినియోగదారుల ప్రయోజనాలను సంరక్షించడం ఒకటని తెలిపారు. టెలికామ్ మెరుగైన సేవలు అందించడం కోసం సెల్ కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్, బిఎస్ఎన్ఎల్, వోడా ఫోన్ తదితర కంపెనీల సేవలపై నిబంధనలు, ఆదేశాలు, పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉత్తర్వులను జారీ చేస్తుందని పేర్కొన్నారు. టెలికామ్ రంగంలో అమలు చేసిన ఆర్థిక సంస్కరణల ద్వారా 110 కోట్ల మంది వినియోగదారులు ట్రాయ్ ద్వారా మెరుగైన సేవలు పొందుతున్నారని చెప్పారు. ట్రాయ్ నిబంధనల ప్రకారం టారిఫ్ సిస్టం, వ్యాపార ప్రకటనల నిషిద్ధం, సేవల నాణ్యత ప్రమాణాలు, మొబైల్ నెంబర్ పోర్టబులిటీ సౌకర్యం, విలువతో కూడిన సేవలు, రక్షణ, వినియోగదారుల హక్కులు, మొబైల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ ఆశయమని తెలిపారు. ప్రస్తుత టారిఫ్ ఇతర కంపెనీల కంటే బిఎస్ఎన్ఎల్ తక్కువగా ఉండడమే కాక 4జి సేవలు రావడం ద్వారా వినియోగదారులు బిఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్నారన్నారు. బిఎస్ఎన్ఎల్ ఎస్‌టిఒ శ్రీనివాసులు, జెటిఒ శంకర్, సిబ్బంది శివకుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డే నారాయణ, కళాశాల కరస్పాండెంట్ సుబ్బరాయుడు, ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, సిబ్బంది తిమ్మయ్య, బాబు, మురుగేంద్ర, రమణమూర్తి, అభిలాష్, బసవరాజ్, వీరేష్, హనుమప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సభ్యులు